సురాసురులు

శేఖర

ఎన్నో లక్షల కుటుంబాల కష్టాలకు, కన్నీళ్ళకు, కక్షలకు, కార్పణ్యాలకు కారణమవుతున్న మద్యపానాన్ని దేశవ్యాప్తంగా నిషేధించాలని ప్రభుత్వ ఆశయం.

ఆ ఆశయమే అమలుపరచబడితే —

రాత్రి తొమ్మిది గంటలైంది. మైసమ్మ గుమ్మంలో కాళ్ళు బారజాపుకుని కూర్చుంది. కాళ్ళమీద పడుకున్న పిల్ల ఏడ్చి ఏడ్చి ఓపికలేక నిద్రపోయింది బయట వెన్నెల కాస్తోంది చల్లగాలి హాయిగా వీస్తోంది. రేషనుకార్డు ఉన్నా, లేకున్నా అందరికీ పుష్కలంగా దొరికే ఆ తెల్లని వెన్నెల, చల్లనిగాలి కూడా మైసమ్మకు దొరకటంలేదు. దేవుడి దయలాగానే అవీ ఆ గుడిసె గుమ్మందాకానే వచ్చి ఆగిపోతున్నాయి. పోనీ తనే గుమ్మందాటి రావాలంటే పిల్ల కాళ్ళు పట్టేసుకుని పడుకుంది. అదీగాక, మైసమ్మ గుడిసె గుమ్మం లోపల కూర్చోవల్సిందేగాని బయట కూర్చునే యోగ్యతలేదు. అక్కడొక

పెద్ద మురుగుకాలవ గంగానదికన్న గంభీరంగా ప్రవహిస్తూ ఉంటుంది. అదొక జీవనది.

ఒంట్లో ఓపికలేదు. తింటానికి ఇంట్లోనూ ఏమీలేదు. పాచిపనిచేసే నాలుగు ఇళ్ళల్లోనూ కలిపితే నాలుగు మెతుకులూ నలుగురు పిల్లలూ వాసన చూసి అర్ధాకలితో కళ్ళుమూశారు. కానీ తెల్లారకముందే కళ్ళు నులుముకుంటూ లేచి 'ఆకలే' అంటూ కేకలేస్తారు. మైసమ్మ వాళ్ళను తిడుతుంది తర్వాత కొడుతుంది. జకరయ్య మాత్రం 'థూః నీ యమ్మ' అని గొణుక్కుంటూ రోడ్డెక్కుతాడు. ఇదా మామూలే సారా మామూలే పనికొచ్చినరోజున, పని పూర్తయ్యాక తాగుతాడు పనిదొరకని రోజున తాగటమే పని పెట్టుకుంటాడు. అందుకు ఎప్పుడూ జేబులో డబ్బులు మిగుల్చుకోవాలనే కష్టం. 'బీదోళ్ళగదా, ఉన్నట్టుండి టిబి లేని టయిముంటది' అంటూ కల్లు కాంపౌండ్లో ఖాతా పెట్టాడు ఇంక జకరయ్యకి దిగుల్లేదు. దుకాణం యజమానికి దిగుల్లేదు. నాకు గాకుండా ఉండలేదు. వచ్చినంతకాలం, నాలుగు రోజులు జబూజబూగా, డబ్బులేకుండా ఉండలేదు. ఏతా, వాతా జకరయ్యకు తాగుడుకు లోటులేదు.

తూలుకుంటూ వచ్చాడు. తనలో తనే వాగుకుంటూ వచ్చాడు. వచ్చి గుమ్మంలో మైసమ్మ కాళ్ళదగ్గర గొంతుకూర్చున్నాడు.

"ఎవురే నే లేని టయములో నీ వాళ్ళో తొంగుంది?.... చెప్పా .... చెప్పమంటుంటే" అని గద్దించాడు.

"నీ కూతురు" అంది మైసమ్మ లేచి పిల్లను, మిగిలిన పిల్లల పక్కన చాప మీద పడుకోబెడుతూ.

"నా కూతురేనని రుజువేంటి? అసలు నీ కూతురేనని రుజువేంటి? చెప్పా....చెప్పమంటుంటే...."

మైసమ్మకి తిక్కరేగిపోయింది. కోపంతో అదీ అరిచింది "నువ్వు నా మొగడవని రుజువేంటి? నేను నీ పెళ్లాన్నని రుజువేంటి...."

"నీ యమ్మ, నాకు ఎదురు తిరుగుతావంటే. నేనంటే లెక్కలేకుండా ఉన్నావు?"

"అందరినుకుంటూనే ఉంటారు, తాగుబోతోడని...."

"నా ఇష్టం నే తాగుతాను నే సంపాయించుకున్నాను తాగుతున్నాను. ఊళ్ళో వాళ్ళ డబ్బుతో తాగుతున్నానా? చెప్పు, ఊళ్ళో వాళ్ళ డబ్బుతో తాగుతున్నానా?" అని మైసమ్మ మీదమీదకు వెళ్ళి రెట్టించాడు.

"సాల్లే, తొంగో....నీ కేకలికి పిల్లలు లేస్తారు." అని ఈసడించుకుని పడుకుంది మైసమ్మ.

మూసుకుపోతున్న కళ్ళు బలంతాన తెరుస్తూ మాట్లాడుతున్నాడు జకరయ్య. కాదు, పేలుతున్నాడు జకరయ్య.

"ఏంటే, నాకు వన్నం పెట్టకుండా, నువ్వు తినేసి తొంగుంటావా? నేను, నీ మొగుణ్ణి. ఇంటికొస్తే, సొంత మొగుణ్ణి ఇంత సీకట్లో పెళ్లాంను వెతుక్కుంటూ ఇంటికొస్తే, నా సంగతేంటి, నేనేంటి, ఎంతిస్తున్నను ఏం తినలేదు అని ఇసారించకుండా తొంగుంటావా, లంజ...." అని జకరయ్య కోపంతో, ఆకలితో, మైకంతో ఊగిపోతూ కాలితో పెళ్లాం డొక్కలో తన్నాడు.

మైసమ్మ గిలగిలాడిపోయింది. వలవలమని ఏడ్చింది. దాని ఏడుపుకి, తండ్రి తాపులకి నలుగురు పిల్లలు లేచి ఏడుపు లంకించుకున్నారు. జకరయ్య గొణుక్కుంటూ నాపమీద ఒకమూలకి ఒరిగి పడుకున్నాడు. ఒళ్ళూ, ఒళ్ళూ తెలిపోయింది. పెళ్లాం పిల్లల ఏడుపులే జోలపాటగా వింటూ నిద్రపోయినాడు.

తెల్లవారింది. కోడికోడి కూయగానే లేచి ఇల్లూవాకిలీ ఊడ్చిపెట్టుకుని పాచి పనికి వెళ్ళే మైసమ్మ ఎండెక్కినా పడుకున్న చోటునుంచి లేవలేదు. రాత్రి మొగుడు పొట్టలో తన్నిన తాకిడికి, కడుపులోని పేగులన్నీ కదిలిపోయినయో [illegible] బాధగా [illegible] ఓపిక లేక కన్నీళ్ళు కారుస్తూ పిల్లలనంక చూస్తూ పడుకుంది. పిల్లలు లేచి లోపలికీ బయటికీ తిరుగుతున్నారు. కడుపు లోపలికి పొయ్యేవి, ఏమన్నా దొరుకుతాయేమోనని ఆశగా మూలనున్న ఖాళీ కుండల్లో చేతులు పెట్టి వెతుకుతున్నారు.

జకరయ్య లేచాడు. బావిదగ్గరకు పోయి మొహంకడుక్కుని, ఒకకుండతో నీళ్ళుపట్టుకొచ్చి పెట్టాడు. జేబులో ఉన్న అర్ధరూపాయి బిళ్ళ పిల్లలచేతుల్లో పెట్టి బయటకు పంపాడు.

పెళ్లాం పక్కన కూర్చుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. "ఇంకెప్పుడూ తన్ననే" అన్నాడు జకరయ్య.

"ఇంకెప్పుడూ తాగనని సెప్పు" అన్నది మైసమ్మ పడుకునే, మొగుడి చేతిని తనచేతితో రాస్తూ.

"ఇయ్యాలనుంచి అంతాబంద్. కల్లు కాంపౌండు మూసేస్తున్నారె. ఇంక మందు సుక్క దొరకనే దొరకదుగదా.... లేవే, నిన్ను ఆస్పటాల్‌కి తీసుకపోతాను...." అని భార్యను లేవదీశాడు జకరయ్య.

* * *

హెవెన్ బార్ అండ్ రెస్టారెంటులో ఆరో నెంబరు క్యాబిన్‌లో ఐదుగురు ఉన్నారు. వాళ్ళ ముందున్న చిన్న టేబిల్ మీద ఐదు గ్లాసులున్నాయి. ఒక ఓ.టి. విస్కీ ఉంది. అయిదు ఖాళీ సోడాబుడ్లు ఉన్నాయి. రెండు చిప్స్, రెండు గ్రీన్ పీసూ ఉన్నాయి. అందరి నోళ్ళలోనూ సిగరెట్లు వెలుగుతున్నాయి. అందరి ఆలోచనల్లోనూ భైరవేశ్వరరావు మెదులుతున్నాడు. వాళ్ళ తలా ఒక

విమర్శ చేస్తున్న, ఆ ఆఫీసరు అక్కడకు వచ్చే ప్రమాదం లేదుకాబట్టి స్వేచ్ఛగా, యధేచ్ఛగా, ఉడతాభక్తి ఆఫీసరిని తిట్టిపోస్తున్నారు.

"వీడికి ట్రాన్స్‌ఫరొచ్చేదాకా మన కీ తిప్పలు తప్పవు గురూ" అన్నాడు అంజనేయులు.

"వెళ్ళినా మళ్ళీరాక ఎక్కడికిపోతాడు గురూ. ఒక డిపార్టుమెంటులో ఉన్నాక వాడి పాలిటి నుంచి ఎన్నాళ్ళు తప్పించుకుంటాం?" అన్నాడు పాండురంగం.

"పాండు చెప్పింది నిజమే గురూ. ఈ భైరవేశ్వరరావుగాడికో లెసన్ చెప్పాలి గురూ" అన్నాడు అహమ్మద్.

"మీకో రహస్యం చెబుతున్నాను వినండి గురువుల్లా. ఆ భైరవేశ్వరరావుగాడి బామ్మర్ది, మినిస్టరుగారి తమ్ముడూ క్లోజ్ ఫ్రెండ్స్. రాక్షసుడి ప్రాణం మర్రిచెట్టు తొర్రలో ఉన్నట్టు, వీడి పొగరుకు కారణం మినిస్టరుగారి బ్రదర్‌లో ఉంది" అన్నాడు కాంతారావు గ్లాసు ఖాళీచేసి టేబులుమీద పెడుతూ.

"మరి వీడున్నంతకాలం మనకి లోన్లు ఎలా దొరుకుతాయి, శలవు లెలా గ్రాంటవుతాయి, ప్రమోషన్లు ఎలా వస్తాయి?" అని అడిగాడు క్రిస్టోఫర్.

"అందుకు మార్గం ప్రస్తుతానికి స్టెనో కమలే గతి. ఇవాళ నాకు రెండు వేలు మారేజ్‌లోను గ్రాంటు ఎవరు చేశారు? భైరవేశ్వరరావా? కాదు. కమల భైరవేశ్వరరావుచేత చేయించింది." అన్నాడు కాంతారావు.

"మరి కమలను పట్టటం ఎలాగురూ?" అని అడిగాడు అంజనేయులు.

"కమలతో డీలింగ్ మనకొక్కళ్ళకే తెల్సు. కాబట్టి బ్రదర్స్, సెక్షన్ లెవెల్‌లో మీరు మా పనులు చేసిపెట్టాలి. పై లెవెల్‌లో కమల సంగతి నే చూసుకుంటాను." అన్నాడు కాంతారావు.

"మరి నీ సంగతి చూడాలంటే?" అహమ్మద్ అడిగాడు.

"సెవెన్‌లో కల్సుకోవటమే" అని నవ్వేశాడు కాంతారావు.

"ఓకే గురూ" అన్నాడు క్రిస్టోఫర్.

"నాకో సందేహం. మనలో ఎవరికి ఎవరు గురువు?" అని అడిగాడు అంజనేయులు.

"ఇంత చచ్చుప్రశ్న వేస్తావని నే ననుకోలేదు గురూ. అసలు మనం ఇప్పుడు ఎవళ్ళం? ఎన్.జి.వో.లమా?" అని జనాంతికంగా ప్రశ్నించాడు కాంతారావు.

"కాదు" కోరస్‌లో అన్నారు.

"భైరవేశ్వరరావులాంటి ఆఫీసర్లమా?"

"పక్కన కమల లేందే భైరవేశ్వరరావులం ఎలా అవుతాం. అసలుగాక కాము."

"మరి మామూలు మనుషులమా?"

"కాము"

"మరి మనం ఎవరం?"

"సురలం"

"మనం ఎక్కడున్నామన్నమాట?"

"హెవెన్‌లో"

"ఈ హెవెన్‌లో లేనివాళ్ళంతా ఎవరన్నమాట"

"అసురులన్నమాట"

"వాళ్ళంతా ఎక్కడున్నారన్న మాట"

"నరకంలో నన్నమాట"

"కానీ బ్రదర్స్ మన కిప్పుడు పెద్ద విపత్తు వచ్చి పడబోతోంది. రేపటినుంచి ఈ హెవెన్ మూత పడబోతోంది. అంచేత మనం తాగాలనుకున్నప్పుడల్లా సురలం కాగలిగామన్న వేదన చెప్పటానికి విచారిస్తున్నాను"

"అవును, నిజమే దీన్ని మనం ప్రతిఘటించాలి మన ప్రాణ నిషేధం...."

"గో టు హెల్"

అంజనేయులు లేచి నిలబడ్డాడు. సోఫా ఎక్కి నిలబడ్డాడు ఉపన్యాసం ఇవ్వదల్చుకున్నాడు వాళ్ళందరిలోనూ కిక్ కాస్త తక్కువగా ఉన్న క్రిస్టోఫర్, అంజనేయులు టేబులుమీద గ్లాసులు, సీసాలు తన్నెయ్యకుండా పక్కకు జరిపాడు అంజనేయులు మొదలెట్టాడు.

"లేడీస్ అండర్ జెంటిల్‌మన్" అని సంబోధించాడు.

"అండర్ అంటూ దేంటి గురూ"

"హెవెన్‌లో భాష మారిపోతుంది. మవ్వేం కంగారుపడకు" కాంతారావు సర్ది చెప్పాడు.

అంజనేయులు ఉపన్యాసం కొనసాగించాడు. 'మంచితనంచేత మనిషిచేత ఏ పని అయినా చేయించవచ్చు. బలవంతాన ఏమీ చేయించలేం: అందుకే అంటారు స్నేహంతో విషమైనా త్రాగించవచ్చు గాని, ద్వేషంతో పాలయినా త్రాగించలేమని."

"హియర్, హియర్"

"స్నేహంతో గుడంబా నయినా త్రాగించవచ్చుగాని, ద్వేషంతో స్కాచ్ విస్కీ అయినా త్రాగించలేం."

"సెబాష్"

అంజనేయులు మళ్ళీ మొదలుపెట్టాడు "మైడియర్ కంట్రీమన్, చిన్న కుటుంబం చింతలులేని కుటుంబమని ఆ మాట చెప్పేవాడికే కాదు, వినేవాడికీ తెల్సు తమంతట తామేవెళ్ళి ఆపరేషన్లు చేయించుకునేవాళ్ళు చేయించుకున్నారు. బలవంతానబస్టాపుల్లోజనాన్నిలాక్కెళ్ళి ఆపరేషన్లుచేయించినందుకు ఏమయిందో మీ కందరికీ తెల్సు కాబట్టి...."

క్రిస్టోఫర్ లేచి అంజనేయులుకుఅడ్డుపడ్డాడు "మీరు ఆవేశం తగ్గించుకుని, సోఫాలో కూర్చోవల్సిందిగా ప్రజలు కోరుతున్నారు."

"నా మాట ప్రజలు వినాలి గాని, ప్రజల మాట నేను వినటం మానేసి చాలాసేపయింది, శిష్యా" అన్నాడు అంజనేయులు, మళ్ళీ ఉపన్యాసానికి ఉపక్రమిస్తూ.

"మీ రిప్పుడు మా మాట వినితీరాలండి. లేకపోతే పైన ఫాను మీ చేతులకి తగిలే ప్రమాదం ఉంది. క్రింద ఓ సీసా పగిలే ప్రమాదముంది."

"ప్రమాదం వచ్చినప్పుడల్లా నేను ప్రజల మాటే వింటున్నాను" అంటూ కూర్చున్నాడు ఆంజనేయులు.

ఆ తర్వాత బిర్యానీలు తెప్పించారు. తింటూ, తాగుతూ, వాగుతూ, వాగుతూ, తాగుతూ, తింటూ, పార్టీ అయిందనిపించారు. బిల్లు చెల్లించి, బయటకు వచ్చారు.

చుట్టూ ఉన్న కాబిన్స్‌లో జనం ఇంకా తింటున్నారు. పెద్దగా కబుర్లు చెప్పుకుంటున్నారు. గోలగా మాట్లాడుకుంటున్నారు. బేరర్ అని అరుస్తున్నారు.

క్రిష్టోఫర్ అడిగాడు. "గురూగారూ, వీళ్ళందరూ చుట్టూ ఇలా వాగుతూ ఉండగా, మధ్యలో నుంచున్న మామూలు వాడికి ఈ గోల ఎలా వుంటుందో వర్ణించండి, చూద్దాం."

"రాసుకో షరి...ఎక్కడైనా ఒక కాకి చచ్చిపోయినప్పుడు, చుట్టూ అనేక కాకులు మూగి కావు కావు కావుమని చేసే గోలకీ, ఈ బార్‌లో మనం చేసే గోలకీ ఏమంత తేడా లేదు. ఎవడికైనా నాలుగురూపాయలు వచ్చాయని తెలిస్తే, మనం ఇక్కడ మూగి ఇలా కాసేపు కాకిగోల చేసి వెళ్ళిపోతుంటాం" అన్నాడు ఆంజనేయులు బార్ గుమ్మం దాటి బయటికొస్తూ.

ఆ మాటలు కాంతారావు విన్నాడు "మూడ్‌లో ఉన్నా ఎంత ఖచ్చితమైన మాట చెప్పాడు!' అని ఆశ్చర్యపోయినాడు కాంతారావు.

మర్నాడు ఉదయం కాంతారావు భార్యచేతికి డబ్బు ఇచ్చాడు. పంద రూపాయలు తక్కువ ఉన్నాయి. ఏమయినయి అని అడిగింది. రాత్రి జరిగినదంతా గుర్తొచ్చింది.

"కొన్ని పనులు కావాలంటే, మరి కొన్ని పనులు చేయాల్సివస్తోంది, రాజీ" అన్నాడు కాంతారావు.

రాజేశ్వరి నిట్టూర్చింది. "మీ కింత డబ్బు రోజూ ఎక్కడినుంచి వస్తోందో నాకు తెలియదుగాని, ఈ మధ్య మీరు ఎక్కువగా తాగుతున్నారు. మీరు తెచ్చుకున్న డబ్బు అప్పు.దాన్ని వడ్డీతో సహా తీర్చాలి. ప్రాణంమీదికొచ్చినప్పుడు అప్పుతీసుకోవటం తప్పుకాదు. కానీ ఇలా వేలకివేలు వ్యసనాలకు తగలేస్తే మన సంసారం ఎలా బాగుపడుతుంది? మీ తెలివితేటలమీద, సంపాదనమీద మేమంతా ఆధారపడి ఉన్నాం. ఆ బార్ లోపలికి వెళ్ళేటప్పుడు నేనుగాని, పాప గాని మీకు గుర్తుకురాలేదా? పదిపైసలు పెట్టి పూలదండగాని, పావలా పెట్టి రెండు పళ్ళుగాని పిల్లకు తేవాలని మీకు తోచదు. పందరూపాయలు పెట్టి, మీ స్నేహితులతో తాగి తందనాలాడుతూ ...." రాజేశ్వరి కన్నీటి వరద ఆగలేదు.

కాంతారావు భార్యను కౌగిట్లోకి తీసుకుని ఓదార్చాడు. "నన్ను క్షమించు రాజీ"

"మీరే నన్ను క్షమించండి. ఇన్నాళ్లూ ఎలాగో ఓపికపట్టినదాన్ని ఇవాళ బయటపడ్డాను రేపటినుంచి ఎలాగూ మీ మందుల షాపులు మూసేస్తున్నారు."

"నేనూ మానేస్తున్నాను" అన్నాడు కాంతారావు.

"దొరకనప్పుడు మానెయ్యటం గొప్ప ఏమీ కాదండీ. దొరికినప్పుడూ దాని జోలికిపోకుండా ఉండటమే గొప్ప."

"నిజమేరా. ఒప్పుకుంటున్నాను," అన్నాడు కాంతారావు భార్య నుదుటిమీద చిన్నగా ముద్దు పెట్టుకుని.

* * *

కారొచ్చి పోర్టికోలో ఆగింది. అందులోనుంచి రాఘవేంద్రరావుగారు, మిసెస్ రాఘవేంద్రరావుగారూ దిగారు. కరుణాకరరావుగారు, మిసెస్ కరుణాకరరావుగారు పోర్టికో మెట్లు దిగారు.

మగవాళ్ళిద్దరూ నమస్కారాలు చేసుకున్నారు ఆడవాళ్ళిద్దరూ నమస్కారాలు చేసుకున్నారు. తర్వాత ఈయన భార్య ఆయనకు నమస్కారం చేసింది. ఆయన భార్య ఈయనకు నమస్కారం చేసింది. అతిథులిద్దర్నీ దంపతులిద్దరూ లోపలికి ఆహ్వానించారు. హాల్లోకి వెళ్ళారు. సోఫాలో కూర్చున్నారు. లేచారు. ఇటు పక్క గదిలోకి వెళ్ళారు. అటు పక్క గదిలోకి వెళ్ళారు. రియర్ వరండాలో నిలబడి మాట్లాడుకున్నారు. రెడ్‌కార్పెట్ పరిచిన మెట్లెక్కి మేడమీదకు వెళ్ళారు. బాల్కనీలోనుంచి చూస్తే 'వ్యూ' బావుందన్నారు. బెడ్‌రూంలోకి వచ్చి టి.వి. ఆన్‌చేసి చూశారు. మిసెస్ రాఘవేంద్రరావు, మిసెస్ కరుణాకరరావు ఫ్రిజ్ గురించి ముచ్చటించుకున్నారు. కరుణాకరరావు, రాఘవేంద్రరావుగారిని కారు మార్చేసి కొత్తది తీసుకోమని సలహా ఇచ్చాడు. సరేనంటే, రేపే తా నా విషయం కనుక్కుంటానన్నాడు. సరేనన్నాడు రాఘవేంద్రరావుగారు.

రాఘవేంద్రరావుగారు ఇంజనీరు. కరుణాకరరావుగారు కాంట్రాక్టరు వారితో వీరికి పని ఉంటుంది. వీరితో వారికి పనిబడుతూ ఉంటుంది. ఈ 'గివ్ అండ్ టేక్' పాలసీకి అందమైన పేరు ఫ్రెండ్‌షిప్. ఈ ఫ్రెండ్‌షిప్ కొన్నాళ్లు కొనసాగి ఫామిలీ ఫ్రెండ్‌షిప్‌లోకి దించింది. దీనివల్ల రెండు కుటుంబాలకి కొన్ని లాభాలున్నాయని నలుగురికీ తెలుసు. అందుకే ఇంత ఆదరణ. పేరులో తప్ప మరెక్కడా కనిపించని కరుణాకరరావు, అన్ననీ, తమ్ముణ్ణీ అల్లంత దూరంలో ఉంచే కరుణాకరరావు రాఘవేంద్రరావుగారిమీద వల్లమాలిన గౌరవం, ప్రేమ కనబరుస్తాడు. ఇంజనీరుగారి భార్య కాలు క్రింద పెడితే 'అరరె కందిపోతుందండీ' అనేంతగా అడుగులకు మడుగులొత్తుతాడు.

పిచ్చాపాటీ మాట్లాడుతూ లాన్‌లోకి వచ్చారు. పేము కుర్చీల్లో సెటిల్ అయినారు ఎంత ఎ. సి. రూములున్నా, ఈ చల్లగాలి దొరకటం కష్టమని ఇంజనీరుగారంటే అవునవునని వెంటనే కరుణాకరరావుగారి భార్య చప్పున ఒప్పేసుకుంది. గార్డెన్ చాలా బాగా పెంచారని ఇంజనీరుగారి భార్య ముచ్చటపడితే, ఈ గార్డెన్‌లో కూర్చునే తన కష్టాలన్నీ మర్చిపోతానని కంట్రాక్టరుగారు అన్నాడు.

వెన్నెల పుచ్చపువ్వులా విరగబడి కాస్తోంది. నౌకరు ట్రేలో గ్లాసులు, సీసాలు తెచ్చి వాళ్ళముందు పెట్టాడు. వాడే సీసాలు తీసి నాలుగు గ్లాసుల్లోనూ పోశాడు. మిసెస్ రాఘవేంద్రరావు తనకు అక్కర్లేదని అభ్యంతరం తెలిపింది. వెంటనే మిసెస్ కరుణాకరరావు తానూ తాగనని వంతపాడింది.

"అట్లా అయితే నేనూ ముట్టుకోను. రేయ్ గోవిందూ పట్టుకెళ్ళిపో" అని బెట్టుసరి చేశాడు కరుణాకరరావు. గోవిందు ముందుకు వంగి సీసాలు ట్రేలో పెట్టుకుంటూ ఉంటే రాఘవేంద్రరావుగారి ప్రాణం ఉసూరుమంది.

"ఇల్లాంటి విషయాల్లో మా ఆవిడ చాలా కన్సర్వేటివ్" అని నవ్వాడు.

"అఫ్‌కోర్సు. మా ఆవిడా అంతే. కాకపోతే, నేను తాగితే తను అభ్యంతర పెట్టదు" అన్నాడు కరుణాకరరావుగారు"

"నా విషయమూ అంతే. ఆ మాటకొస్తే చాలా ఫామిలీస్‌లో మగవాళ్ళు తాగటం మామూలైంది" అని వ్యాఖ్యానించాడు రాఘవేంద్రరావుగారు.

"ఆడవాళ్ళు గ్లాసులు అందించటం అంతే సహజం అయింది. అడపాదడపా వాళ్ళూ కంపెనీకోసం తీసుకోవటంలో తప్పేమీ లేదని. నా అభిప్రాయం. ఇప్పుడు ఎలైట్ సొసైటీలో కాఫీలు మానేశారు. గెస్ట్‌లు రాగానే డ్రింక్స్ ఇస్తున్నారు. ఇందులో అభ్యంతర పెట్టాల్సినంత తప్పేమిటో నాకు తెలియటంలేదు అఫ్‌కోర్స్, ఐ మేబీ రాంగ్...."

మిసెస్ రాఘవేంద్రరావు గిల్టీగా ఫీలయింది. "నాకు వద్దన్నాను గానీ, మిమ్మల్ని తీసుకోవద్దనలేదు. పైగా మా ఇంట్లో ఆయనెప్పుడూ స్టాక్ పెట్టుకుంటూనే ఉంటారు. నాకు వాసన పడదు" అన్నది.

"చెప్పరేం, సరి. మీరు టాలరేట్ చెయ్యరేమోనని భయపడ్డాను." అని నౌకరుకు సంజ్ఞచేశాడు. వాడు మగవాళ్ళిద్దరికీ ఇచ్చాడు.

"మీరు జిన్ తీసుకోండి. అది లేడీస్ డ్రింకే గదా" అన్నాడు కరుణాకరరావు రెండో రౌండులోకి వెళ్తున్నప్పుడు.

"అయామ్ సారీ, చెప్పాను గదా, నా కా వాసన గిట్టదు.వాంతులొచ్చేస్తాయి. కావాలంటే మరో సీసా ఫెంటా తాగు

తాను" అన్నదామె, బెత్తెడు జరీ అంచు పైటకొంగును భుజాలమీద నుంచి గుండెల మీదకు కప్పుకుంటూ.

"మై మిసెస్ ఈజ్ సింప్లీ ఫెంటాస్టిక్ ...." అని జోక్ చేశాడు రాఘవేంద్ర రావుగారు.

"ఇవాళ్టొక్కరోజే మీకీ పర్మిషన్. రేపట్నించీ అంతా ఫెంటాస్టిక్‌లే." అని గుర్తుచేసిందామె.

కరుణాకరరావు అందుకున్నాడు "సరే, రాఘవేంద్రరావుగారు, నాకు తెలియక అడుగుతా... ఈ ప్రొహిబిషన్ నిజంగా అవసరమే నంటారా ?"

"అవసరమే" అన్నాడు రాఘవేంద్ర రావుగారు, సిగరెట్టు వెలిగించుకుని, పొగ వదులుతూ.

"తాగుబోతులైన మీరు ప్రొహిబిషన్ అవసరమంటారేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగింది ఇంజనీరుగారి భార్య.

"నేను రోజూ తాగొచ్చు. అంత మాత్రాన నన్ను తాగుబోతు క్రింద బ్రాండ్‌చేస్తే పళ్ళురాలగొడతాను. ఐ నెవర్ బిహేవ్ ఇండీసెంట్లీ. ఆ తేడా తెలియనివాళ్ళని మనం క్షమించి వది లెయ్యాలి."

"ఇంతకీ నా సందేహం తీర్చలేదు మీరు." అని అడిగాడు కరుణాకరరావు.

"చెప్పానుగదా. ప్రొహిబిషన్ అవసరమే, అంతమాత్రాన తాగేవాళ్ళంతా మానేస్తారా అని మీ ప్రశ్న. చాలామంది మానెయ్యవచ్చు. కొంతమంది దొంగ తనంగా తాగొచ్చు. తాగుడుకు అలవాటు పడ్డవాళ్ళను బాగుచెయ్యటానికి చేసిన ప్రయత్నం ఎంతవరకు సఫలమవుతుందీ అన్న పాయింటు అలా పక్కన పెడితే దీనివల్ల జరగబోయే మేలు ఏమిటంటే, ఇంతవరకూ అలవాటులేనివాళ్ళు ఇక ముందు దీనికి బానిసలయ్యే ప్రమాదాన్ని తగ్గించటానికి ప్రొహిబిషన్ చాలావరకు తోడ్పడుతుంది. ముఖ్యంగా నాలుగు రూపాయలు జేబులో ఉన్న యువతరం వాళ్ళు నిర్భయంగా తాగే అవకాశం ఉండదు. ఇంత సునాయాసంగా సీసాలు కొనుక్కువెళ్ళి తాగే పరిస్థితి ఉండదు అంతవరకూ అది విజయవంతమైనట్లే కదా ... ఉదాహరణకి, నేను తాగుతున్నాను. మా ఆవిడ తాగదు. కానీ ఇది ఇలాగే కొనసాగితే, నా ప్రభావం ఆమె మీద పడి తనూ తాగే పరిస్థితి రావచ్చు. మరి నాకే దొరకనప్పుడు, ఆవిడకి అలాంటి ప్రమాదం లేదు. నా బాధ అర్థమైందా?" అని అడిగాడు రాఘవేంద్రరావు మళ్ళీ గ్లాసు పైకి తీసుకుంటూ.

"అర్థమైంది" అన్నాడు కరుణాకర రావు.

భోజనం తయారుగా ఉంది రమ్మని మిసెస్ కరుణాకరరావు పిలవటంతో ముగ్గురూ లేచారు.

* * *

3

కల్లు దుకాణాలు మూసేస్తే, తన మొగుడు తాగుడు మానేస్తాడనీ, తాగుడు మానేస్తే, తెచ్చే అయిదూ పదీ చేతికి వస్తాయనీ, వాటితో తనింత తిని, మొగుడికి పిల్లలకి తిండిపెట్టే అవకాశం ఉందని మైసమ్మ ఎన్నాళ్ళనుంచో అనుకుంటూ వచ్చింది పెళ్ళయిన మర్నాడే మొగుడు తాగి వస్తే, మొగుడ్ని తిట్టలేదు. సారాదుకాణం వాళ్ళనే తిట్టింది. కానీ చివరకు ప్రభుత్వమే సారా దుకాణాలు తెరిచి శుభ్రంగా బీదాబిక్కీని చెడగొడుతుంటే, ఎవర్ని ఏమని నిందించాలో తెలియలేదామెకు.

దేశమంతటా మళ్ళీ మద్యపాన నిషేధం అమలుపరుస్తున్నారని తెల్సాక సంతోషించిన మొట్టమొదటి వ్యక్తి మైసమ్మే. తన కుటుంబమే కాదు, తన లాంటి మైసమ్మలు ఎందరున్నారో వాళ్ళందరి కుటుంబాలూ బాగుపడతాయని నమ్మింది మైసమ్మ.

అనుకున్నట్లుగానే కల్లుదుకాణాలు మూతపడినయి. జకరయ్య కాలుగాలిన పిల్లిలా రోడ్లన్నీ తిరిగివస్తున్నాడు. ఏపని చెయ్యబుద్ధికావటంలేదు. దేని మీదా మనసు కుదరటంలేదు. రోజూ సాయంత్రం రెండుసీసాలు పట్టిస్తే ఒంటికి ఏనుగంతబలం వస్తుంది. నరాల్లో నెత్తురు వరదొచ్చిన గోదావరిలా పొంగుతుంది. తల గిర్రున తిరుగుతుంది. కళ్ళు మత్తుగా దూసుకుపోతుంటాయి. బుర్రలోని నట్లు అన్నీ వదులైపోతయి. హాయిగా మనసులో ఉన్నది ఉన్నట్లు వాగెయ్యగలడు. ఆ కాసేపూ ఏమైనా చేసెయ్యగలడు పెళ్లాన్ని తిట్టి, కొడితే గాని తను మగవాడైనందుకు, మొగుడైనందుకు ఫలితం ఉండదు అనుకుంటాడు. ఇప్పుడా అనుభవం కరువైతే, జీవితంలో అన్నీ పోగొట్టుకున్నట్లే అనిపిస్తోంది తింటున్నా, తిరుగుతున్నా నరాల్లోని నిస్సత్తువ, తీపు తగ్గటంలేదు. పగలు కష్టపడితే రాత్రికి తాగేవాడు. పనిచేసినందుకు, డబ్బు చేతికొచ్చినందుకు ఫలితం, రాత్రికి దొరికే నిషాలోఉండేది. ఇప్పుడేమీలేదు

కల్లు దుకాణం యజమాని చంద్రయ్యకు జకరయ్య మూడొందలు బాకీ ఉన్నమాట నిజమే. కానీ ఇప్పుడు తీర్చాలంటే ఎంతో కష్టంగా ఉంది. ఇది వరకు ఎన్నో వందలు తీరుస్తూ ఉండేవాడు. మళ్ళీ అప్పుచేస్తూ ఉండేవాడు. కొత్త అప్పు పుట్టటంకోసం పాత అప్పు తీరుస్తుండేవాడు. ఇప్పుడా ఆశ లేదు కాబట్టి పాత అప్పు తీర్చదల్చుకోలేదు. చంద్రయ్య మూణ్నెల్లపాటు మనుషుల్ని పంపిస్తూనే వచ్చాడు. అయినా జకరయ్య పైసా ఇవ్వలేదు

ఒకరోజు జకరయ్య రోడ్డున నీరసంగా నడిచివస్తున్నాడు. చంద్రయ్య సైకిలుమీద వస్తూ, జకరయ్య పక్కన

ఆగాడు. పాతబాకీ గురించి అడిగాడు. తన దగ్గర లేదన్నాడు జకరయ్య. ఐనా చంద్రయ్య పోట్లాటకు దిగ లేదు. చొక్కా పట్టుకుని నిలెయ్యలేదు.

"నీకాడ డబ్బు లెక్కడికి పోతయి గాని, అసలెట్టా వుంటున్నావు, ఏంటి?" అని కుశల మడిగాడు.

"ఏంటి దొరా. నువ్వు దుకాణం బందుచేశావు. నా బ్రతుకులో సుఖమే మాయమైంది. ఏం చెయ్యాలో తోచటం లేదు" అని నెత్తి గోక్కున్నాడు.

"రోడ్డుమీద దుకాణం మూసేశాం గాని, మనలాంటోళ్ళకి రగస్యంగా ఒక చోట దొరుక్కుద్ది. ఎప్పుడేనా కావాలంటే...."

జకరయ్యకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు అయింది. "మీ కాళ్ళుమొక్తు తా దొరా. ఎక్కడ దొరుకుతాదో సూపియ్యండి."

"అరె నీయమ్మ, సిన్నంగ మాట్లాడరా, పోలీసులకు తెలిసెనా అంటే, నిన్ను - నన్ను అందర్నీ బొక్కలో తోస్తారు.

"లేదులే, దొర ఒకపాలి సూపియ్యి దొర" అని జకరయ్య చంద్రయ్య వెంట పడ్డాడు.

జకరయ్యకు చెప్పవల్సినవన్నీ చెప్పి, ఊరిబయట తాటిలోపుల్లోకి తీసుకెళ్లాడు. అక్కడొక గుడిసెలో జకరయ్య అప్త మిత్రులు మరికొందరు కల్సారు. చాలా రోజుల తర్వాత మళ్ళీ కళ్ళు తిరిగి పడిపోయేంతవరకు తాగేశాడు. అర్ధరాత్రికి కొంపజేరాడు. తూలుకుంటూ, సంతోషంగా పాడుతుంటూ వస్తున్న జకరయ్యను చూసి మైసమ్మ కొయ్యబొమ్మ అయిపోయింది.

"తాగితే మరిసిపోగలను. మరిసిపోతే తాగగలను - మనసు గతి ఇంతే. ఈ మణిసి బ్రతుకింతే...."

"నీ బతుకింతే" అని గొణుక్కుంది మైసమ్మ.

"ఏంటే, ఏంటి తిడతన్నావు. నే నెవరనుకుంటున్నావు నువ్వు? నీ మొగుడ్ని అన్న ఇసయం తెల్సా, చెప్పు...." అంటూ పెళ్లాం జుట్టుపట్టుకుని గుంజాడు

మైసమ్మ తోసింది. జకరయ్య కిందపడ్డాడు. లేచాడు.

"ఏంటే, నన్ను తోసేస్తావా? నే నెవరనుకుంటున్నావు చెప్పు" అంటూ తన్నాడు. మైసమ్మ మొగుడు తన్నులు భరించలేక పక్క గుడిసెలోకి పరుగెత్తింది. చాపమీద పడుకున్న పిల్లలందర్నీ కూడా తన్ని, బయటిగ్గెంటి, వెల్లకిలా పడుకుని, కాలుమీద కాలేసుకుని కళ్ళు మూసుకున్నాడు.

మర్నాటినుంచీ మామూలే. మునుపటికీ, ఇప్పటికీ వచ్చిన మార్పేమిటంటే జకరయ్య, చంద్రయ్యకు మరీ దాసుడైపొయ్యాడు. జకరయ్య ఇదివరలో మేస్త్రీ దగ్గర కూలికి పోతుండేవాడు.

ఇప్పుడా పనిమానేసి హాయిగా చంద్రయ్య దగ్గరే ఉండిపొయ్యాడు. ఊరి బయట తాటితోపులో జరిగే వ్యాపారంలో మునిగి పొయ్యాడు జకరయ్య. తాగుడులో రాత్రీ పగలూ తేడా లేకుండా అక్కడే పడి ఉండటం మొదలుపెట్టాడు.

రోజూ తాగే అమృతంలో విషమెట్లా కల్సిందో మరి ఒకనాడు తాగినవాళ్ళంతా కక్కుకుని స్పృహలేకుండా పడిపోయి నారు. కొందర్ని హాస్పటల్‌కు తీసు కెళ్లారు. మరి కొందరికి అవసరం లేక పోయింది.

జకరయ్య శవాన్ని తెచ్చి గుమ్మం ముందు పడుకోబెట్టారు. మైసమ్మ మీద పడి ఏడవలేదు. కట్టెబొమ్మలా చూస్తూ నిలబడింది. ఆమెకు ఇంకా ఆ పాట విని పిస్తూనే ఉంది. మొగుడు తూలుకుంటూ రావటమే కనిపిస్తోంది.

'మనసుగతి ఇంతే.... ఈ మణిసి బతుకింతే....'

* * *

అహమ్మద్ ఇంటి లోనుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. సెక్షను వాళ్ళ కాళ్ళూ గడ్డాలు పట్టుకుని, వాళ్ళకు చేయవల్సిన వాగ్దానాలు అన్నీ చేసి ఫైలు పైకి పంపించుకున్నాడు. కానీ భైరవేశ్వర రావు ఏదో ఒక పుల్ల వెయ్యకుండా దాన్ని శాంక్షను చెయ్యడు. పని కావాలంటే ట్టైనో కమలతో చెప్పించాలి. కమల ఎవ్వరితోనూ మాట్లాడదు. వీళ్ళందర్ని పురుగుల్ని చూసినట్టు చూస్తుంది. కాస్త కాంతారావు మాటకే విలువ ఇస్తుంది. అందుకే అహమ్మద్ కాంతారావును పట్టాడు.

కాంతారావు వచ్చి కమలపక్కన కూర్చున్నాడు. "ఏంటి చాలా బిజీగా ఉన్నారు?" అని అడిగాడు.

నిజానికి అప్పుడు ఆమె చాక్‌లెట్ చప్పరిస్తూ వీక్లీలో సీరియల్ చదువు కుంటోంది. అందుకని నవ్వింది.

"మీకీ సీరియల్స్ అంటే ఇష్టమా?" అని అడిగాడు మళ్ళి.

"ఎక్కడో ఒకటీ, అరా బాగుం టాయి. మిగిలినవన్నీ ఏదో టైంపాస్... వాళ్ళు వేస్తుంటారుగాబట్టి మేం చదువు తుంటాం....అంతే"

"మీరు చదువుతుంటారు గాబట్టి వాళ్లు వేస్తుంటారు గాబట్టి రాసేవాళ్లు రాస్తుంటారు. పోనీ మీరూ రాయ కూడదూ...." అని అడిగాడి.

"నే రాస్తే చదివేవాళ్ళు ఎవరూ?" అని అడిగింది. కమల నవ్వుతూ.

"నేనున్నాను" అన్నాడు వెంటనే. "మీరు చేసే ప్రతిపనీ నా కిష్టమే."

"అయితే కష్టమే. ఉపోద్ఘాతం చాలు గాని, పాయింటుకు రండి."

"అంటే నేను పని ఉంటేగాని మీ దగ్గరికి రానంటారు. అలా అనుకునే టట్లయితే, నే వెళ్ళిపోతాను."

"పోతేపొండి. మీకే నష్టం." అని సీరియల్ చదవటంలో మునిగిపోయింది

"అయితే వెళ్ళిపోతున్నాను" అని బెదిరించాడు.

"ఏమిటో చెబుదురూ, నసుగుడు మానేసి...."

"అహమ్మద్ అని నా క్లోజ్ ఫ్రెండ్. ఇల్లు కట్టుకుంటాడుట. లోన్‌కు పెట్టుకున్నాడు. దొరగారి మూడ్ చూసి చిన్న పొట్టిసంతకం పడేయించాలి."

"ఆ మాట ముందు చెప్పొచ్చుగా. దానికి నాచేత సీరియల్స్ రాయించటం ఎందుకు?" అని నవ్వింది.

"నువ్వింత తెలివిగలదానివి కాబట్టే నాకెంతో ఇష్టం...."

"మీరు సీరియల్‌గా పొగుడుతున్నారు" కమల నవ్వింది.

"లేదు. సీరియస్‌గా పొడుగుతున్నాను. మర్చిపోకు." అని వెళ్ళిపోయాడు కాంతారావు.

అహమ్మద్‌కు లోను శాంక్షను అయింది పార్టీ ఇస్తేగాని, ఆర్డరు చేతికివ్వరు. అదీ పద్ధతి. పార్టీలు ఇవ్వటం ఇదివరకటినుంచీ వస్తున్న ఆనవాయితీ. ఇరుసున కందెనలేక ఈశ్వరుడి బండైనా కదలదని అనుభవజ్ఞులు, విజ్ఞులు అంటారు.

ఇప్పుడు పార్టీలు ఇవ్వాలంటే పెద్ద ఇబ్బంది వచ్చిపడింది. దానికి టోలెడంత తతంగం ఉంది ముందు ఆంజనేయులు గారితో చెప్పి, డబ్బు రెట్టింపు ఇచ్చి మందుకు ఏర్పాటు చేసుకోవాలి. దాని తర్వాత తగినచోటు వెతుక్కోవాలి. కాంతారావు, ఆంజనేయులు కల్సి ఈ రెండుపనులూ రెండుగంటల్లో పూర్తి చేశారు. క్రిస్టోఫర్ క్వార్టర్ ఖాళీగా ఉంది. అతని ఫామిలీ ఊళ్ళోలేదు. కాంతారావు నాలుగుగంటలకే డబ్బు తీసుకుని, హేండ్‌బ్యాగ్ తీసుకుని వెళ్ళిపొయ్యాడు.

ఎనిమిదిగంటలకు ఆటోలో కాంతారావు దిగేటప్పటికి, మిగిలిన వాళ్ళంతా ఎదురుచూస్తున్నారు అప్పటికే నవ్వులూ, కేరింతలూ, ఆటలూ, పాటలూ మొదలైనయి. క్రింది క్వార్టర్‌లోనున్న వాళ్ళు ఈ గోల భరించలేకపోతున్నారు.

తొమ్మిదిగంటలు దాటేటప్పటికి అంతా సభ్యతను మర్చిపోయి మాట్లాడుకునే స్థితికి వచ్చారు.

"అసలు కాంతారావుమాట కమల ఎందుకింటుంది, కమల మాట భైరవేశ్వరుడు ఎందుకింటున్నాడు? దీని రహస్యమేంటి? ఎవరైనా దీనికి సమాధానం తెల్సీ చెప్పకపోయినారో, వాళ్ళ తల వెయ్యి వక్కలైపోతుంది...." అని లేవదీశాడు పాండురంగం.

"దానికేముంది. స్నేహం." అని తేల్చేశాడు అహమ్మద్‌ఖాన్.

"ఇప్పుడు మనంగూడా స్నేహితులమే. మనమేం చైనావాళ్ళంకాదు. కానీ మనకో లోను రావాలంటే, క్రింది లెవెల్‌లో ఒక పద్ధతి ఉంది. అంతవరకూ మనకు

అర్థమవుతోంది. పై లెవెల్‌లోని పద్ధతి తెల్సుగాని, దాని అంతర్యం తెలియ ట్లేదు గురూ....” అని అడిగాడు క్రిస్టోఫర్.

“కమల ఈజ్ మై సిస్టర్..”అన్నాడు కాంతారావు.

“నో, భైరవుడు ఈజ్ యువర్ బ్రదర్ ఇన్‌లా” అన్నాడు క్రిస్టోఫర్.

“డోంటాక్ రబ్బిష్” అని అరిచాడు కాంతారావు.

“షటప్ అండ్ గెటవుట్” అని లేచాడు క్రిస్టోఫర్.

నిముషంలో వాళ్ళిద్దరూ శత్రువులై పోయినారు. పౌరుషాలు పెరిగినయి. క్రిస్టోఫర్ కాంతారావును మెట్లమీద నుంచి తోసేశాడు.

రెయిలింగ్ తలకు తగిలిన కాంతారావు నుదురు చిట్లి గాయమైంది. నలుగురూ గుమిగూడారు. పోలీసు కంప్లయింట్ ఇచ్చారు. కేసుబుక్ అయింది.

కమల కాంతారావు ముహం చూడటం మానేసింది. ఇప్పుడతని ముహాన మచ్చ వికృతంగా ఉంది. ‘నానాటికీ తీసికట్టు నాగంబొట్లూ అన్నట్లు నీ కుటుంబం ఇలా అయిపోతుందేం తల్లీ’ అని ఏడ్చి రాజేశ్వరిని ఆమె తండ్రి పుట్టింటికి తీసుకువెళ్లాడు.

కాంతారావు గడ్డం పెంచుకుని, తనలో తనే పిచ్చిగా గొణుక్కుంటూ రోడ్లమీద తిరుగుతూ కనిపించినప్పుడు, ఆంజనేయులు, అహమ్మద్‌కూడా అతన్ని ఎరగనట్లు తప్పుకుపోతుంటే, కాంతారావు తుపుక్కున ఉమ్మేస్తాడు.

* * *

కరుణాకరరావు, రాఘవేంద్రరావు గారి కోసం వచ్చాడు. ఆయన వచ్చిన సమయంలో ఇంజనీరుగారు లేరు. ఇప్పుడు రెండు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం పెరిగింది కాబట్టి మిసెస్ రాఘవేంద్రరావు, కరుణాకరరావుతో చనువుగానే మాట్లాడుతుంది.

“ఆయన లేరు. కాంపుకు వెళ్లారు,” అని చెప్పింది.

“ఈ మధ్య కాంపులు ఎక్కువయ్యాయే” అని అడిగాడు కరుణాకరరావు.

“నిజమే. ఇదివరకు ఆయనకు కావాల్సిందేదో తాగి, ఇంటిపట్టునే పడి ఉండేవారు. ఇప్పుడు దానికోసం కాంపులు వేసుకుంటున్నారు. నేను ఒంటరిగా బోర్ భరించలేక చస్తున్నాను.”

“ఇంటికి చాటుగా తెప్పించుకో వచ్చుగా.”

“దానికెన్ని గొడవలు. పోలీసుల కన్నుపడితే కష్టంగదా. మన డబ్బుతో మనం తాగాలన్నా వాళ్ళకు భయపడి చావాల్సి వస్తోంది.”

“మనం అంటున్నారు. మీకూ వాసన గిట్టినట్లుందే.”

“అబ్బే అదేం లేదు. మన డబ్బు అంటే ఆయన డబ్బు అని అర్థం.”

"మేమంతా ఉండగా ఆయన ఇన్ని ఇబ్బందులు ఎందుకు పడాలో తెలియటం లేదు. ఎక్కడా దొరకనిది, ఫారిన్ సరుకు సాయంత్రం పట్టుకొస్తాను. ఆయనకు ఇవ్వండి. ఇచ్చాక, పుచ్చుకున్నాక నా పేరు చెప్పటం మర్చిపోవద్దు" అన్నాడు కరుణాకరరావు.

సాయంత్రం బ్రీఫ్‌కేసుతో వచ్చాడు. మిసెస్ రాఘవేంద్రరావు కరుణాకరరావును పడకగదిలోకి తీసుకురమ్మంది. వెళ్ళి ఫ్రిజ్‌లో భద్రంగా దాచిపెట్టాలని చెప్పాడు నవ్వుతూ.

"వాసన గిట్టదంటారుగానీ, ఇది వాసనా వుండదూ, మైకమూ ఉండదు. హాయిగా గాలిలో తేలిపోతున్నట్లు ఉంటుంది. ఫారిన్‌ది కదా" అన్నాడు.

మిసెస్ రాఘవేంద్రరావు మాట్లాడలేదు. సీసా తీశాడు. గ్లాసులో పోశాడు. వాసన చూడమన్నాడు. ఆమె కేమీ వాసన వెయ్యలేదు.

"డోకొచ్చేంత వాసన ఉంటే, ఇంత మంది ఎగబడి ఎందుకు తాగుతారు? తాగినవాళ్ళ దగ్గర నుంచి వాసన రావచ్చుగానీ, తాగినవాళ్ళకి వాసన తెలియదు. అందమైన అనుభూతి తప్ప, తప్పొప్పుల సంగతేమీ తెలియదు. ఒక్కసారి చూడండి. ఇష్టంలేకపోతే అప్పుడే మానెయ్యవచ్చు." అని బలవంతం చేశాడు కరుణాకరరావు.

ఎప్పటినుంచో దానిమీదనున్న అసహ్యం, ఆమె కా క్షణంలో కొద్దిగా తగ్గింది. అతని ప్రోద్బలం నిద్రాణంగానున్న ఒక కోర్కెను తట్టి లేపింది. ఆమె సందేహంగా అతనివంక చూసింది. అతను గ్లాసును ఆమె పెదవులకు అందించాడు. మొహం చిట్లించుకుంటూ గుటకవేసింది. చేదుగా ఉంది. తిమ్మిరిగా ఉంది. కొంచెం మంటగా ఉంది. గొంతు దిగాక హాయిగానే ఉంది. దాని గొప్పదనం గురించి కరుణాకరరావు చెబుతూనే ఉన్నాడు. రెండు గ్లాసులు పట్టించాక మిసెస్ రాఘవేంద్రరావు ఒళ్ళు తెలియని స్థితిలో సోఫాలోకి వొరిగిపోయింది. కరుణాకరరావుకు ఎన్నాళ్ళుగానో ఎదురుచూసిన అవకాశం అలా అనుకోకుండా వచ్చింది. ఆమె మీదకు వంగి ముద్దుపెట్టుకున్నాడు.

కిటికీలోనుంచి ఆ పన్నివేశం చూసిన రాఘవేంద్రరావు గుండె భగ్గున మండిపోయింది. టాక్సీలో వెడుతూ ఆలోచించాడు. వీణ్ణి ఏంచెయ్యాలి. పిస్టల్‌తో కాల్చెయ్యాలా? కత్తితో పొడిచెయ్యాలా? ఎలకలమందుతో చంపెయ్యాలా? ఏం చెయ్యాలి? ఏం చేసినా వాడు చస్తాడు. అదో పెద్ద పాయింట్ కాదు. వాడు చచ్చిపోతే అందులో వింతేమీ లేదు. వాడు బ్రతుకుతూ బతకాలి. వాణ్ణి వికార్ని చెయ్యాలి.

రాఘవేంద్రరావు టాక్సీ దిగి, మిసెస్ కరుణాకరరావుతో కరుణాకరరావు

గెస్టుహౌస్‌లో ఉన్నాడనీ, తన భార్య కూడా అక్కడే ఉందనీ, ఈమెను తీసుకువెళ్ళటానికి తాను వచ్చాననీ చెప్పాడు. పావుగంటలో ఆమె అందంగా తయారై వచ్చింది. రెండు సీసాలు, గ్లాసులు కూడా తీసుకురమ్మన్నాడని అందమైన అబద్ధానికి చక్కని రంగు పూశాడు. ఆమె సీసాతోపాటు తినుబండారాలు కూడా బుట్టలోకి సర్దింది.

గెస్టుహౌస్‌లో కరుణాకరరావుగాని, ఇంజనీరుగారి భార్యగాని లేరు అందుకు రాఘవేంద్రరావు అంతులేని ఆశ్చర్యాన్ని అభినయించాడు. వాళ్ళిద్దరూ ఎక్కడికో వెళ్ళి ఉంటారని, వెంటనే వస్తారని, ఈలోగా అన్నీ సిద్ధంచెయ్యమనీ చెప్పాడు.

మందే గుండెల్లోకి, మధువును పోశాడు. మంట మరీ ఎక్కువైంది రాస్కెల్, చూసుకోమన్నాడు.

మిసెస్ కరుణాకరరావును తన దారికి తెచ్చుకోవటానికి, రాఘవేంద్రరావుకి ఎక్కువ శ్రమపడాల్సిన పని లేకపోయింది. ఇంజనీరుగారికి ఎదురు తిరిగితే, తమ బ్రతుకులు సుడిగాలికి కొట్టుకుపోతాయని ఆమెకు తెలుసు.

ఆ రాత్రి రాఘవేంద్రరావు తన కక్ష తీర్చుకున్నాడు. ఆమె తెల్లారి చూసుకుంటే, ఒంటిమీద అమెరికన్ జార్జెట్ చీర లేదు పక్కన తడుముకుంది. అక్కడా లేదు గదంతా వెతికింది. ఎక్కడా లేదు. తన మానాన్ని కాపాడుకోవటానికి మరే గుడ్డ పేలికన్నా దొరుకుతుందేమోనని కళ్ళంత చేసుకుని చూసింది. లాభం లేదు. చివరికి బెడ్‌షీటుగాని, డోర్ కర్టెన్‌గాని ఏమీ కనపడలేదు. చేతులు అడ్డంపెట్టుకుని గుమ్మం బయటకి తొంగిచూసింది.

దూరంగా చౌకీదారు కనిపించాడు. చెయ్యి ఊపి రమ్మంటే, వచ్చి సాయం చేశాడు.

జరిగిన మోసం తెలిసి కరుణాకరరావు, రామవేంద్రరావు ముహం చూడలేకపోయినాడు. కరుణాకరరావుకు కంట్రాక్టు ఇచ్చిన పనులేవీ సరియైన పద్ధతిలో చేయలేదని, అతని బిల్లులేవీ ప్యాసుచేయకపోగా, కట్టినవన్నీ దగ్గర ఉండి కూలగొట్టించాడు రాఘవేంద్రరావు. కరుణాకరరావు పేర్చుకుంటూ వచ్చిన గోడలన్నీ, నదిలోని నీటిలో మునిగిపోయినయి.

(నీతి ; ఒక ఆదర్శంకోసం శాసనాలు చేయకూడదని కాదు సుమా. అంత మాత్రాన చాలదని).